తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వెంకన్న సేవలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ మిశ్రా



తిరుమల, సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర దర్శించుకు న్నారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కుప్పంలో తెలుగుమహిళలచే క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా కుప్పంలో శనివారం రాత్రి తెలుగు మహిళలు, తెదేపా నేతలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి బస్టాండు మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్ దారుణమని పేర్కొన్నారు. వెంటనే చంద్రబాబును విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

# అధినేత అరెస్టుతో భగ్గుమన్న టిడిపి శ్రేణులు

### -తిరుపతిలో సిఎం జగన్ దిష్టిబొమ్మ దగ్ధం
### -ముఖ్యనేతల గృహనిర్బంధం





తిరుపతి, సెప్టెంబర్ 9ప్రభాతవార్త:
ఎవరూ ఊహించని రీతిలో అర్ధరాత్రి హైడ్రామా తరువాత టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం ఉదయం సిఐడి పోలీసులు అరెస్టుచేసి తీసుకెళ్ళ డంతో ,ఆయన సొంత జిల్లా ఉమ్మడిచిత్తూరు జిల్లావ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ళు ఆందోళన చేపట్టారు.తెలుగుతమ్ముళ్ళు ఉదయం తమ నిరసనలు తెలియజేస్తూ ఆందోళన తీవ్రతరం చేశాయి. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిష్టిబొమ్మను,టైర్లను టిడిపి నేతలు దగ్ధం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.తిరుపతి రీజియన్ పరిధిలో అన్ని డిపోల్లో ఆర్టీసి బస్సులు మధ్యాహ్నం వరకు డిపోకే పరిమితమయ్యాయి. ముందస్తుగా శనివారం వేకువజాము నుండే తిరుపతిలో టిడిపి నేతలు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, సూరాసుధా కర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, శ్రీదర్‌వర్మ, ఆర్‌సి మునికృష్ణ, సింగంశెట్టి సుబ్బరామయ్య తదితరులను గృహనిర్బంధం చేసి సాయంత్రం విడుదల చేశారు. ఆ తరువాత చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి శ్రేణులు తిరుపతిలోని వెస్టు పోలీసుస్టేషన్ ముందు బైటాయించి నిరసన తెలిపారు. దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కేసులో ఆరుమంది మహేశ్‌యాదవ్, ఆర్‌పి శ్రీనివాసులు ఇతర తెలుగుతమ్ముళ్ళపై తిరుపతి పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు.

## ఎమ్మెల్సీ భరత్ ఇంటి ముట్టడికి యత్నం



ఎమ్మెల్సీ భరత్ నివాసం సమీపంలో దేశం శ్రేణులను చెదరగొడుతున్న పోలీసులు

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో శనివారం కుప్పంలో వైకాపా శ్రేణులు కొందరు పట్టణంలో టపాకాయలు కాల్చారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు దేశం శ్రేణులు పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ ఇంటిని ముట్టడిం చేందుకు చేరుకునా న్నరు. మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నా దేశం శ్రేణులు తప్పించు కుని భరత్ ఇంటివైపు పరుగులు తీశారు. దీంతో పోలీసులు సైతం పరుగులు తీస్తూ దేశం శ్రేణులను అర్బన్ సిఐ శ్రీధర్, ఎస్సై శివకుమార్‌లు సిబ్బందితో చెదరగొట్టి వెనక్కు పంపా రు. కాగా పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుప్పంలో 30 పోలీస్ యాక్ట్ అమ ల్లో ఉందని నిరసనలు, ర్యాలీలకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు.

**బెంగళూరులో దేశం శ్రేణుల నిరసన :**
చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ శనివారం కర్ణాటక రాజధాని బెంగళూరులో సైతం దేశం అభిమానులు నిరసన తెలిపారు. వైకాపా ప్రభుత్వం చంద్రబాబుపై కక్షసాధింపుకు దిగిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.
**వి.కోట :** ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా వి.కోటలో దేశం శ్రేణులు ధర్నా చేపట్టారు. చంద్రబాబు అరెస్ట్ దారుణమని తమ ప్రభుత్వం అధికారంలో వస్తే ఇందుకు ప్రతి చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చిత్తూరులో హౌస్ అరెస్టులు

**వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు**
**రోడ్లపై కన్పించని అర్టీసీ, ప్రైవేటు బస్సులు**
**స్వచ్ఛంధంగా దుకాణాలు మూసివేసిన వ్యాపారులు**





చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
జాతీయ తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శనివారం తెల్లవారుజాము నంద్యాలలో సిఐడి అధికారులు అరెస్టు చేయడంతో ఈ ఘటనను అసరా చేసుకొని జిల్లాలో పార్టీ ఇమేజ్‌ను మరింత పెంచి హైప్ తీసుకురావడానికి తెలుగదుశం నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. అయితే పోలీసులు తెలుగుదేశం నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేయడంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద స్థాయిలో నిరసనలు, ధర్నాలు జరుగలేదు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు అరెస్టు చేసిన సమాచారం తెలిసిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది, తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ మేయర్, ఛైర్మన్లు, మాజీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ముఖ్య నాయకులను పోలీసులు తెల్లవారుజాము 5 గంటల నుండి ఇంటి నుండి బయటికి రాకుండా హౌస్ అరెస్టులు చేశారు. జిల్లా కేంద్రం చిత్తూరులో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌లను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసులు మొత్తం 18 మంది తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో వుంచారు. అలాగే రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీ సురేంద్రకుమార్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అలాగే చిత్తూరు టుటౌన్ పోలీసులు మాజీ మేయర్ కఠారి హేమలతను గంగనపల్లిలోని ఆమె ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, దేశం నాయకులు, షణ్ముగం, ప్రభుతేజ, యువరాజ్, మురళీలను తీసుకెళ్ళి అరెస్టు చేశారు. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ రోడ్డుపైకి అనుచరులు, కార్యకర్తలతో వచ్చి నిరసనకు దిగడంతో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్ళారు. పలమనేరు, వి.కోటల్లో దేశం అధినేత అరెస్టును నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేశారు. జిడినెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిలైన డాక్టర్ థామస్, మురళీమోహన్‌లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో ప్రైవేటు, అర్టీసీ బస్సులు శనివారం రోడ్లపై కన్పించలేదు. ఆటోలు, ద్విచక్రవాహనాలు మాత్రమే రోడ్లపై తిరుగులాడాయి. అర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కాగా, ప్రైవేటు బస్సులు షెడ్లలో వుండిపోయాయి. మరోవైపు చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు అరెస్టు చేయడంతో చిత్తూరు నగరంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో దుకాణదారులు శనివారం తెల్లవారుజాము నుండి దుకాణాలను స్వచ్ఛంధంగా మూసి వేశారు.

## సూళ్లూరుపేటలో టిడిపి శ్రేణుల ఆందోళన

### తోపులాటలో సొమ్మసిల్లిన పరసా రత్నం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త



సొమ్మసిల్లి పడిపోయిన దృశ్యం

మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అరెస్టు చేసిన నేపథ్యంలో సూళ్లూరుపేటలో టిడిపి శ్రేణులు శనివారం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. బస్టాండు సమీపంలోని టిడిపి కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు అక్కడ తమ నిరసన తెలియజేశారు. సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐలు మనోజ్‌కుమార్, విజయకుమా ర్‌రెడ్డిలు ఉదయం నుంచి పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రబాబునాయుడి అరెస్టు సమాచారం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకొని మూకుమ్మడిగా ఆందోళన చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఒక దశలో పోలీసులకు, కార్యకర్తలకు తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పరసా రత్నం సొమ్మసిల్లి పడిపోయారు. సుమారు గంటసేపు ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం జరుగుతుందన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆకుతోట రమేష్, సుబ్రహ్మణ్యంనాయుడు, సతీష్‌చంద్ర, కొక్కు శంకరయ్య, బుద్ధి విజయలక్ష్మి, అలవల శ్రీనివాసరావు, సురేష్‌నాయుడు, మెస్ రమణయ్య, చిట్టేటి పెరుమాళ్లు, మంజుల, పాకం వెంకటసుబ్బయ్య, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెదేపా మహిళలు కాగడాలతో నిరసన



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
వైసిపి పాలనతో అంధకారంలోకి వెళ్ళిన రాష్ట్రానికి సద్బుద్ధి ప్రసాదించి వెలుగులు నింపాలని కోరుతూ తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి అరాచకాలతో రాష్ట్రం అట్టుడికి పోతోందని సాక్షాత్తు తెలుగుదేశంపార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై కుట్ర, కుతంత్రాలతో అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడంపై టిడిపి శ్రేణులు కాగడాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుమతి, ప్రధాన కార్యదర్శి దుర్గ, మాజీ కౌన్సిలర్ అనిత, ఊహ, జయశ్రీ, సునీమా, చంద్రకళ, సుభాషిని, శ్రీలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనలు: హౌస్ అరెస్టులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు అరెస్టుతో తెలుగుదేశం పార్టీలో అగ్రహాజ్వాలలు రగిలాయి.దీనికి తోడు పోలీసులు స్థానిక నాయకులను హౌస్ అరెస్టులు, కార్యకర్తలను అరెస్టు,ఆందోళన చేస్తున్న వారిపై దౌర్జన్యాలు చేయటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయం 10గంటల వరకు బస్సులను డిపోలకే పరిమితం చేసారు. దేశం వర్గాలను అదుపులో తీసుకున్న తరువాత బస్సులను వదలి పెట్టారు. మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడు, ఆయన అనుచరులను హౌస్ అరెస్టు చేసారు.నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి చెన్నై వెళ్ళి వస్తుండగా సత్యవేడు వద్ద అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో కూర్చొబెట్టారు. ఇక పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, మహిళా నాయకురాలు చక్రాల ఉష, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడును అంబేద్కర్ విగ్రహం వద్ద అరెస్టు చేసారు. టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి దశరథాచ్చారిని వేకువ జామునే అరెస్టు చేసారు.



**మాజీ ఎంఎల్ఏ ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు:**
శనివారం సూర్యోదయంకు ముందే శ్రీకాళహస్తి టౌన్ సిఐ అంజూ యాదవ్ వారి సహచరులు సుమారు 20మంది పోలీసు వాహనాలతో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ఇంటిని చుట్టుముట్టారు. వారిని హౌస్ అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. ఎవ్వరిని లోపలకు అనుమతించకుండా ఎస్‌సివి నాయుడును బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఏర్పేడు మండలంలో ఆందోళన చేస్తున్న దేశం నాయకులు రెడ్డివారి గురువారెడ్డి,నాగరాజునాయుడు,మల్లికార్జున్ నాయుడు, బాబు నాయుడు సీతాపతి,సతీష్ తదితరులను అదుపులో తీసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త
రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన శ్రీ సిటీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. రోడ్డు ప్రమాదంలో అతివేగంతో కారు చెట్టును ఢీకొనడంతో కారులోని ఇద్దరు వ్యక్తులు అక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు పాలైంది.

## జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబంది

### తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త



రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా డిఎస్పిలు, సిఐలు, ఎస్‌ఐలు సిబ్బందితో ప్రధాన కూడలిల నందు ఎలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అసాంఘిక ఘటనలకు ఆస్కారం లేకుండా నిరోధించడానికి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు నాకాబంది నిర్వహించారు. జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి కూడా స్వయంగా నాకాబందిలో పాల్గొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేసి పర్యవేక్షించారు. ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్‌డివిజన్‌లో పరిధిలో డిఎస్పిల ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొని అనుమానిత ప్రాంతాలన్నీ, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఎల్ అండ్ ఓ కులశేఖర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త
ఉపాధ్యాయులు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని, విద్యార్థులలో సృజనాత్మకతను, సామర్థ్యాలను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీలు పేర్కొన్నారు. శనివారం ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేరణ కలిగేలా పాఠాలను, నీతి కథలను కూడా బోధించాలని అన్నారు. ఉపాధ్యాయులు పని చేసే పరిస్థితులు, పిల్లల యొక్క ఆర్థిక పరిస్థితులు అనుగుణంగా బోధించే ఉపాధ్యాయులు వారి సేవలను గుర్తిస్తూ ఇంకా 100 శాతం విద్యార్థులను అభివృద్ధి వైపు నడపిస్తారని ఉద్దేశ్యంతో ఉపాధ్యాయులు అందరికి ఈ సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఉవ ప్రతి ఒక్కరు కూడా ఏ స్థాయిలో ఉన్నా మనకు పాఠాలు నేర్పిన గురువును ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి సబ్జెక్టు ఏమైతే నేర్పిస్తారు. ఆ విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గాంధీజీ, అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తుల జీవితంలో కూడా గొప్ప గురువు ఉన్నారు కాబట్టి వారు అనుకున్నది సాధించగలిగినారన్నారు. ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తూ వారిలో స్ఫూర్తిని కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు పాఠశాలలోని నిర్మించబడుతుందని అందువల్ల గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని విద్యార్థులను అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఉపాధ్యాయులను చంద్రగిరి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులను, అంగన్వాడీ కార్యకర్తలను సత్కరించారు. తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐసిడిఎస్ పిడి, డిఈవోలకు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రెటరీ లక్ష్మీ, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి, డిప్యూటీ ఈఓ ఆనంద రెడ్డి, చంద్రగిరి, ఎంఈఓ లలిత కుమారి, నియోజకవర్గ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, అంగన్‌వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సకలజనుల సౌభాగ్యమే లక్ష్యంగా వరుణ యాగం

### టిటిడి ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి

చంద్రగిరి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
సకలజనుల సౌభాగ్యమే లక్ష్యంగా వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు టిటిడి ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కళ్యాణ వెంకన్న ఆలయంలో శ్రీనివాస అష్టోత్తర శతకుంధాత్మక మహాశాంతి వరుణ యాగం వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ఆగమోక్తంగా నిర్వహిస్తున్నారు. వరుణ యాగంలో మొదటి రోజున రక్షాబంధనం, గజపూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుణదేవుడుని ప్రసన్నం చేసుకునేందుకై మూడు రోజుల పాటు వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి అనుగ్రహంతో తిరుమలలోని ధర్మగిరిలో ఆగస్టు 21 నుండి 26 వరకు కరీరిష్టి వరుణజప మహాశాంతి యాగం నిర్వహించినట్లు ఈ కార్యక్రమంలో జెఈఓ వీరబ్రహ్మం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాద్, సూపరిం టెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, నగ్రా



మునిచెంగల్రాయులు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, బాలాజీ రంగాచార్యులు, కంకణ భట్టార్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ చేతిలో పోలీసులు కీలుబొమ్మలు

**పాలసముద్రం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల్లో పోలీసులు కీలుబొమ్మలుగా మారారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రభావశీల గుర్తింపు కమిటీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ భీమినేని చిట్టిబాబు ధ్వజమెత్తారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టు కావడంతో పాలసముద్రం పోలీసులు భీమినేని చిట్టిబాబును శనివారం హౌస్ అరెస్టు చేశారు. పోలీసుల తీరుపై భీమినేని చిట్టిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతున్నదని, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్ళల్లో ఆనందం కోసమే పోలీసులు ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేశారన్నారు. గతంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రి దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై కేసులు పెడితే ప్రస్తుతం తనయుడు సిఎం వైఎస్ జగన్ కేసులు పెట్టి కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు అరెస్టుతో సిఎం వైఎస్ జగన్ పతనం ప్రారంభమైందన్నారు.

## చంద్రబాబును అరెస్టు చేయడం హేయమైన చర్య

**చిల్లకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**



తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం తెల్లవారు జామున నంద్యాలలోని సిబిఐ అధికారులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని టిడిపి మండల అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. శనివారం ఉదయం తెలుగు దేశం పార్టీ నాయకులతో కలిసి జాతీయ రహదారిని దిగ్బంధించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి. గోపాల్ సిబ్బందితో కలిసి నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు చిట్టేటి శ్రీనివాసులు, అన్నం మునిశేఖర్, మూగ శంకరయ్య, కృష్ణారెడ్డి, వెంకటరమణయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం : తెలుగు తమ్ముళ్ళు

- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**



తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని తెలుగు దేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శనివారం మండల కేంద్రంలోని కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధినేతను అరెస్టు చేసి వైసీపీ ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎలాంటి ముందుస్తు సమాచారం లేకుండా అరెస్టు చేయడంలో ఆంత్యర్యమేమిటాని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగనోహ్మాన్ రెడ్డికి, ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాధలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని పచ్చికాపల్లం కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు నాయకులను అదుపులోనికి తీసుకుని కొందరిపై కేసు నమోదు చేశారు.మండల పార్టీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, గంగాధర నెల్లూరు నియోజకవర్గం మీడియా సమన్వకర్త గురసాల కిషన్ చంద్, నాయకులు మునిచంద్రా రెడ్డి, జయచంద్ర, వెంకటేష్, రాజా రెడ్డి, శ్రీరాములరెడ్డి, గంగయ్య,చంద్రబాబు రెడి పాల్గొన్నారు.

## నారా చంద్రబాబునాయుడుని అన్యాయంగా అరెస్టు



**నింద్ర, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని రాజకీయ కక్ష్యతోనే వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అరెస్టు చేయించారని నింద్ర మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు తీవ్రంగా విమర్శించినారు .శనివారం మండలంలోని యంజి కండ్రిగ గ్రామంలో టిడిపి రాష్ట్ర యస్‌సి సెల్ ఉపాధ్యక్షులు ధశరద వాసు,మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వరరావును హౌస్ అరెస్టు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనాయకుడుగా రాష్ట్ర అబివృద్ధి కోసం ఎన్నో సేవలు అందించి వ్యక్తిని కక్ష సాధింపుతో ఆదారాలు లేకుండా అరెస్టు చేయడం దారుణం అని విమర్శించినారు. చంద్రబాబునాయుడు అరెస్టుకి నిరసనగా నెట్టేరి రోడ్డులో టిడిపి ఆద్వర్యంలో నిరసన తెలిపారు. మండలంలో ఎలాంటి అవాంచనీయమైన సంఘటన జరగకుండా ముందుస్తుగా నింద్ర యస్ఐ శివశంకర్ టిడిపి నాయకులను, కార్యకర్తలను హౌస్ అరెస్టు చేసారు.తరువాత సాయంత్రానికి సొంతపూ చికత్తుతో విడిచిపెట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్దటిడిపి ఆద్వర్యంలో నిరసన తెలిపారు.ఈకార్యక్రమంలో మాజీ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయుడు,చిట్టిబాబు,కుప్పానాయుడు,నాయకులు రవినాయుడు, ఎజె రవికుమార్,రమేష్, బాబుయాదవ్, జగన్,విజయకుమార్,దినకర్, దయాళ్,ఆనంద్, యబిరాజ్, నాగరాజ్,జయచంద్ర నాయుడు, గంగధర్‌నాయుడు,కోటీశ్వరరావు,ప్రశాంత్‌కుమార్,దేవన్,క్రిష్ణయ్య,దేవనేషన్,మురళీనాయుడు,ఆనంద్,పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు ముప్పైమంది ఎంపిక

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

కుప్పం లయన్స్ క్లబ్, పిఇఎస్ వైద్య కళాశాల అధ్వర యంలో శనివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం ఎనభైమందికి కంటి పరీక్షలు జరిపి వారిలో ముప్పై మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరంలో పాల్గొన్నవారికి రాజరాజేశ్వరి దుస్తుల వ్యాపారులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, కార్యదర్శి పిజి సెల్వం, కోశాధికారి ప్రసాద్, డైరెక్టర్లు లెనిన్, కృష్ణమూర్తి, చరణ్, సెంధిల్, వైద్యులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్‌చే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

కుప్పం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో బిసిఎన్ విద్యాసంస్థల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అధ్వర్యంలో లయన్ క్వెస్ట్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ తరపున చేపట్టే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, లయన్ క్వెస్ట్ సభ్యులు గంగాధర్, సుమిత్రరెడ్డి, వినోద్‌కుమార్, డా॥ లక్ష్మీమూర్తి, ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా బిజెపీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడుకు సత్కారం

**తవణంపల్లె, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**



భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మండలంలోని గోనెపల్లెకు చెందిన ఎస్.జగదీశ్వరనాయుడును ఆపార్టీ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు శ్రీధర్ చౌదరి శనివారం ఘనంగా సత్కరించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా జగదీశ్వరనాయుడును నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. ఈమేరకు చిత్తూరు బిజెపీ జిల్లా కారా ్యలయంలో జగదీశ్వర నాయుడును కలసి శ్రీధర్‌చౌదరి అభినందనలు తెలియజేస్తూ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వరనాయుడు పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాణిపాకంలో 150 మందికి ఉచిత వైద్యపరీక్షలు

**కాణిపాకం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆస్థానం మండపంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన కావేరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దేవస్థానం సిబ్బంది, కాణిపాకం పరిసర గ్రామాల సౌకర్యార్థం ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిభిరాన్ని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు ప్రారంభించారు.ఈసందర్భంగా 150 మందికి రోగులకు వివిధ రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి,కావేరి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఉష, డాక్టర్ సౌమ్య, ఆస్పత్రి ఇన్‌చార్జిలు మునీంద్ర, ప్రవీణ్, సిబ్బంది పాల్గొనా న్నరు.

## 14న కాణిపాకం హుండీల లెక్కింపు

**కాణిపాకం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 14న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు స్థానిక యూనియన్ బ్యాంకు వారిచే జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

## బాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి నేతల నిరసన

**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ బంగారుపాళ్యంలో తెలుగుదేశం నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుండి శనివారం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి తమ నిరసనతో నినాదాలు చేశారు. నిరసన వ్యక్తం చేయడానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు తెలుగుదేశం నాయకులతో వాగ్వివాదం చేశారు. పోలీసులను లెక్కచేయక తెలుగుదేశం నాయకులు రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేపట్టారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ సైకో జగన్ పోవాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, ఉపాధ్యక్షుడు కమలనాధరెడ్డి, చిత్తూరు పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, మైనార్టీ విభాగ అధ్యక్ష, కార్యదర్శులు నాసిర్‌ఖాన్, జాకీర్‌లు, తెలుగుదేశం నాయకులు శివ, కృష్ణకుమారి, దేవయాని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తవణంపల్లెలో చంద్రబాబు అరెస్ట్‌పై నిరసన

**తవణంపల్లె, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై మండల పార్టీ అధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామ్యమంటూ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు నినదిస్తూ మండలంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈసందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌నాయుడు, మధుకుమార్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐరాల క్రాస్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం డౌన్ డౌన్,సైకో పోవాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యకిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు కోదండయ్య, వెంకటేశ్వర చౌదరి, నాయకులు అరగొండ గిరిబాబు, సునీల్ చౌదరి, మోహన్‌నాయుడు, శరవణ, వినాయకం, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలు ఉదయం నుండి సాయంత్రం వరకు నిలిచిపోయాయి.

## చంద్రబాబు అరెస్ట్‌పై ఐరాలలో నిరసనలు

**ఐరాల, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**



టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై మండలంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామ్యమంటూ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని పలు ప్రాంతాల్లో పలు రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరిధర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ లతల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపై బైఠాయించి ధర్నా, రాస్తారోకోలు వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు కాణిపాకం, మద్దిపట్లపల్లె, చింత గుంపలపల్లె, పాటూరు తదితర ప్రాంతాల్లో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం డౌన్ డౌన్,సైకో పోవాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి వ్యకిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఇదిలా వుండగా పాటూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు స్వల్ప లాఠీ చార్జ్ చేసి అందోళనకారులనుతరిమివేశారు.ఈఆందోళన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

**కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ ఏటా ప్రజలకు ఆర్థరైటిస్ ('కీళ్లవాపు) అంశంపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈసందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఎస్ డా॥ సుబ్రమణ్య, ప్రిన్సిపాల్ డా॥ బిసేష్‌కుమార్, హెచ్ఒడి డా॥ రేవతి, డా॥ వైజెవి రెడ్డి, న్యూరో సర్జన్ డా॥ మయూర్ వినయ్‌కుమార్, హెచ్ఒడిలు డా॥ నాగకిరణ్, డా॥ చిత్ర నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో తెదేపా నేతల ధర్నా.. సిఎం దిష్టిబొమ్మ దగ్ధం

**శాంతిపురం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా శాంతిపురంలో తెదేపా శ్రేణులు ధర్నా, రాస్తారోకో చేపట్టాయి. ఈసందర్భంగా సిఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసి సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున దేశం శ్రేణులు చేరుకున్నాయి. అనంతరం కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో బైఠాయించారు. కొంతసమయం ఎస్సై మునస్వామి, దేశం నేతలకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. దేశం నేతలు మండల కేంద్రంలో దుకాణాలు మూయించారు. అనంతరం మండల సచివాలయం దాకా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిలో టైర్లను తగలబెట్టారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూరిల్లు దగ్ధమైన వారికి నిత్యవసర సరుకులు పంపిణి

**చిల్లకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన గుడి నారాయణ అనే వృద్ధుని పూరిల్లు రెండు రోజుల ముందు విద్యుత్ షాక్‌కు గురై కాలిపోవడం జరిగింది. ఈ విషయాన్ని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన సొంత నిధులతో 5 వేల రూపాయిలు నగదు 25 కేజీల బియ్యం, నెలకు సరిపడ్డ నిత్యవసర సరుకులు శనివారం తహశీల్దార్ కె. శ్రీనివాసులు వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమ్య స్వాతి, విఆర్ఓ జయరామయ్య,పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా రాస్తారోకో

**బాలాయపల్లి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టును తీవ్రంగా ఖండించిన మండల పార్టీ అధ్యక్షులు దాసరి రాజగోపాల్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్‌నాయుడు, టీడీపీ నేతలు రావి సత్యం నాయుడు, కోటేశ్వరగౌడ్, సిసింద్రీ యాదవ్, బూతు ప్రసన్నకుమార్‌యాదవ్, సీవికే నాయుడు నిరసనగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జిలు ధరించి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ చేపట్టి ఇదేమి రాజ్యం, ఇదేమి దోపిడీ రాజ్యం అంటూ టీడీపీ నేతలు నిరసన ప్రదర్శన చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన చేశారు.దీంతోవాహనరాకపోకలుభారీగా స్తంభించి వాహనచోదకులు అవస్థలు పడ్డారు.

## మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హౌస్ అరెస్ట్

- ఇంటి వద్ద ఉద్రిక్తత



**వెంకటగిరి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్ దారుణమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను గృహనిర్బంధం చేయడంతో వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబునాయుడు అక్రమాలు చేశారని తప్పుడు కేసు పెట్టినట్లు విమర్శించారు. చంద్రబాబు 14 సంవత్సరాలు సీఎంగా ఉన్నాడని, ఎలాంటి మచ్చ లేకుండా పరిపాలన సాగించినట్లు తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి లండన్‌కి పోతూ చంద్రబాబునాయుడు అరెస్ట్ చేయమని పోలీసులకు డైరెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ఇంటి బయట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 24వ వార్డులో రామ్‌కుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హత ఉంటే సంక్షేమ పథకాలు రాకుంటే వెంటనే ఇస్తామన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. సంక్షేమ పథకాలు రావడంలేదని స్థానికులు చెప్పడంతో అర్హత ఉంటే ఇప్పి స్తామని తెలిపారు. తమ ఇంటికి నెంబర్ ఇవ్వడంలేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఇప్పిం చాలని కమిషనర్ వెంకటరమణ ఆదేశించారు. సైడ్ కాలువలు కావాలని కోరడంతో వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, నారాయణ, వహీదా, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు అరెస్ట్

**వెంకటగిరి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

మాజీ సీఎం చంద్రబాబునాయుడుని అరెస్ట్ చేసినందుకు రాస్తారోకో చేస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు మరికొందరు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన పార్టీ నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మూతికి నల్ల బ్యాడ్జిలు కట్టుకుని పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి రాస్తారోకో చేస్తుండగా ఎస్ఐ నరసింహారావు, సిబ్బంది అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేస్తున్న సందర్భంలో టీడీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, వెంకటాచలం, బీరం రాజేశ్వరరావు తదితరులను అరెస్ట్ చేశారు.

## ఘనంగా ఎంఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జన్మదిన వేడుకలు

**నాయుడుపేట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**



నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన నివాసంలో నిర్వహించిన ఈ వేడుకలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపిపి ధనలక్ష్మి, ఎన్‌డిసిసిబి మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, వైసీపీ నాయకులు కటకం జయరామయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుకు టిడిపి నాయకుల నిరసన

**నాయుడుపేట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నాయుడుపేట పట్టణంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి టిడిపి నాయకులతో కలిసి నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడిని అర్ధరాత్రి అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మచ్చలేని నాయకుడు చంద్రబాబుపై ఏదో విధంగా మచ్చ వేయాలని కుట్రపన్ని చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు పేరంశెట్టి శ్రీరాంప్రసాద్, వేలూరు మురళీకృష్ణారెడ్డి, మౌలారి రాజశేఖర్, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, శ్రీపతి బాబు, జివిఆర్ నాయుడు, మాజీ ఎంపిపి తుపాకుల కన్నెమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో పటిష్ట బందోబస్తు

**నాయుడుపేట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**



నాయుడుపేటలో తెలుగుదేశం పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేసిన నేపథనయంలో టిడిపి నేతలను, నాయకులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా హౌస్ అరెస్ట్ చేస్తున్నారు. వారి ఇళ్ల ముందు పోలీసు పికెటింగ్‌లు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బస్టాండ్‌లోకి బస్సులు రానివ్వకుండా పోలీసులు తిప్పి పంపించారు. దీంతో ప్రయాణికులు కొంత అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదు

**కోట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

యువతకు నైపుణ్యాభివృద్ధి పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆ సంస్థ పేరుతో డబ్బులు కొట్టేసి స్కిల్‌ను ప్రభుత్వ పెద్దలు ప్రదర్శించడం చంద్రబాబునాయుడికి చెల్లిందని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు మొబిన్‌బాషా చెప్పారు. వారు శనివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. సీమెన్స్ కంపెనీ సంస్థ గురించి తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగి పలువురిని అరెస్టు చేసిందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడిని అరెస్టు చేయడంలో తప్పేమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు చట్టానికి దొరికాదని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుతో టిడిపి క్యాడర్‌లో సానుభూతి వస్తుందో రాదో కాని నైరాశ్యం ఏర్పడిందన్నారు.

## చంద్రబాబు అరెస్టుతో కోటలో ఆందోళన

**కోట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడిని సిఐడి పోలీసులు అరెస్టు చేయడంపై శనివారం కోటలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. గాంధీబొమ్మ సెంటర్‌లో శాంతియుతంగా నిరసన చేస్తున్న టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. కనీసం చంద్రబాబుకు నోటీసులు కూడా ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏమిటని మైనార్టీ సెల్ నాయకులు జలీల్ అహ్మద్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాల పాలు రాష్ట్రాన్ని పాలించిన ఓ నాయకుడిని అరెస్టు చేయడం దుర్మార్గచర్య అన్నారు. వైసీపీ ప్రభుత్వం కక్షతో చంద్రబాబును అరెస్టు చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్,

## టిడిపి నాయకులు అరెస్ట్

**వాకాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**



స్కిల్ డెవలప్మెంట్ కేసులో టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిఐడి అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో శనివారం మండల టిడిపి నాయకులు నిరసనలు ఆందోళనలు, చేపట్టగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల టిడిపి పార్టీ కన్వీనర్ మధు రెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, వేణు నాయుడు, మోహన్ నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యురాలు ప్రమీల, మాజీ సర్పంచులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు 50 మంది పైగా వాకాడు పోలీసులు వారి వివరాలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోనే టిడిపి నాయకులను అదుపులో ఉంచారు.

## కోటలో లోక్ అదాలత్

**కోట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోటలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి భరత్‌కమల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల పిలుపు మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. లోక్ అదాలత్‌లో కోర్టులలో అపరిష్కృతంగా ఉన్న సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాద, కుటుంబ వివాదాలు, బ్యాంకు ఫైనాన్స్ ప్రీ లిటిగేషన్ తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ విధంగా పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వీటిపై హైకోర్టులలో అప్పీలు చేసుకునే అవకాశం లేకుండా పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. పలు కేసులను రాజీ చేశారు.

## చంద్రబాబు అరెస్టు అన్యాయం

**కోట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త**

అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి ఖ్యాతిని చాటిచెప్పిన నాయకుడు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని తిరుపతి జిల్లా బిసిసెల్ నాయకులు తీగల సురేష్‌బాబు వ్యాఖ్యానించారు. ఆయన శనివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ 45 ఏళ్లుగా తెలుగువారి అభ్యున్నతికి తెలుగు రాష్ట్రాల ప్రగతికి అనునిత్యం కృషి చేస్తున్న చంద్రబాబుని ఒక్కరోజైనా జైలులో పెట్టి మానసిక ఆనందం పొందాలన్న దురుద్దేశంతో తప్పుడు అభియోగాలు మోపి అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. సిబిఐ, ఈడీ కేసుల్లో ఏ1 నిందితుడిగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరిపై బురదచల్లాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుని విడుదల చేసే వరకు నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. చంద్రబాబు అరెస్టు అక్రమం, చట్టవిరుద్ధమని ఆరోపించారు.

## శ్రీ పద్మావతి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**వాకాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**



వాకాడు మండలం దుగరాజపట్నం పంచాయితీ పరిధిలోని కొండూరు పాలెం గ్రామంలోని శనివారం శ్రీ పద్మావతి సమేత ప్రసన్న వెంకటస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి పాలాభిషేకంతో పాటు ఆలయ ధర్మకర్త సన్నారెడ్డి చంద్రభూషణ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి ఆలయంలోని విద్యుత్ అలంకారంతో, పలు సాంస్కృత కార్యక్రమాలు, ప్రత్యేక కళాకారుల చేత సంకీర్తన కీర్తనలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఏడవ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ కార్యక్రమాలుకూడా చేపట్టారు. ఈ కార్యనిర్వహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిం చారు.

## నాయలకుల అండతో భూ కబ్జాకు సన్నాహాలు

అడ్డుకున్న గ్రామస్తులు

**చిల్లకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త**

అధికార పార్టీ నాయకులు అండతో భూ కబ్జాకు సన్నాహాలు చేస్తున్నారని గుత్తవారిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం కమ్మవారిపాలెం గ్రామ పంచాయితీలో ఉన్న గుత్తవారిపాలెం గ్రామంలో సర్వే నెంబరు 742 నుండి 800లో మాకు కొంత భూమి ఉంది. ఈ భూమిని గతంలో రైతులకు పట్టాలు మంజూరై వున్నాయని రైతులు తెలిపారు. అయితే కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో జేసిపి సహాయంతో గూడూరుకు చెందిన ఓ రైతు కొంత భూమిలో మామిడి చెట్లు సాగు చేసుకుంటూ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు శనివారం యంత్రాల సహాయంతో కంప చెట్లు తొలగిస్తున్నారని ఈ విషయం తెలుసుకున్న రైతులు యంత్రాలను అడ్డుకోవడం జరిగింది. ఈ విషయాన్ని తహశీల్దార్ కె. శ్రీనివాసులను వివరణ కోరగా మామిడి తోటలో కంప చెట్లు ఉన్నాయని వాటిని తొలగించేందుకు తహశీల్దార్ అనుమతి కావాలని మామిడి తోట రైతు అడిగాడని తప్పా ప్రభుత్వ భూముల్లో కంప చెట్లు తొలంగించేందుకు సమాచారం ఇవ్వలేదని తహశీల్దార్ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ, విఆర్ఓలు సంఘటనా స్థలానికి చేరుకుని యంత్రాలను నిలుపుదల చేయడం జరిగింది.

# ఉపాధ్యాయులు... విద్యార్థులను భావి పౌరులుగా తీర్చి దిద్దాలి

## - కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జె,సి.బాలాజీ,తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలతో పాటు సమాజానికి ఉపయోగపడే విధంగా భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సూచిం చారు. శనివారం ఎస్వీ యూనివర్శిటీ శ్రీనివాస ఆడిటోరియంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని 1800 ఉపాధ్యా యుల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేరణ కలిగేలా పాఠాలను, నీతి కథలను కూడా బోధించాలన్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర అవకాశం ఒక ఉపాధ్యాయునికే కలదన్నారు. ఉపాధ్యా యులు పని చేసే పరిస్థితులు, పిల్లల యొక్క ఆర్థిక పరిస్థితులు అనుగుణంగా బోధించే ఉపాధ్యాయులు, వారిసేవలను గుర్తిస్తూ ఇంకా 100శాతం విద్యార్థులను అభివృద్ధి వైపు నడిపిస్తారనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు అందరికి ఈ సన్మాన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులను సన్మానిస్తే... సమాజాని సన్మానించినట్లే అని తెలిపారు. జిల్లాలో పదోవ తరగతి పాస్ కాని, పాస్ అయి, ఇంటర్మీడియేట్ జాయిన్ కాని విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్ లేదా అదే పాఠశాలలో చేర్పించి, వారి చదువును కొనసాగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సేవలు గుర్తించి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చెడు మార్గంలో వెళ్ళకుండా మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఏ స్థాయి లో ఉన్నా గురువును మాత్రం మరవకూడదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులలో దాగియున్న సృజనాత్మకతను, సామర్థ్యాలను వెలికితీసి ప్రోత్స హించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. బాగా చదివిన విద్యార్థికి సబ్జెక్ట్ నేర్పితే ఆ విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానానికి చేరతారన్నారు. గాంధీజీ, అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తుల జీవితంలో కూడా గొప్ప గురువు ఉన్నారు కాబట్టి, వారు అనుకున్నది సాధించగలి గారన్నారు. ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తూ వారిలో స్ఫూర్తిని కలిగించాల్సిన అవసరం ఏంతైన ఉందన్నారు. తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్ పాఠశాలలోనే నిర్మించబడుతుందని, గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా విద్యార్థులను అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఉపాధ్యాయులను, అంగన్వాడి టీచర్ల సేవలను గుర్తించి సన్మానించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలువతో సత్కరించి, బట్టలు, స్వీట్ బాక్స్‌లు అందజేసారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఎక్కడయితే ఉపాధ్యాయులు గౌరవింపబడతారో అక్కడ అభివృద్ధి ఉంటుందని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని పాఠశాలలు, కళాశాలు అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యా యులను తుడ చైర్మెన్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. సిబిఎస్ సిలబస్‌తో పాటు బైజూస్ కంటెంట్ ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. తుడ కార్యదర్శి లక్ష్మీ, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మీ, డిప్యూటీ ఇవో ఆనందరెడ్డి, చంద్రగిరి ఎంఇవో లలిత కుమారి, నియోజకవర్గం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అవినీతి ఆదేశాలతో నిజాయితీకి సంకెళ్ళు : టిడిపి



గంగవరం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : ఓ అవినీతి పరుడి ఆదేశాలతో నిజాయితీ పరునికి సంకెళ్ళు వేయడం అప్రజాస్వామికం అని గంగవరం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబుని సిఐడి పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్టు చేయడం దుర్మార్గమని,అప్రజాస్వామికమని టిడిపి నాయకులు ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు పలమనేరు మదనపల్లె జాతీయ రహదారిపై బైటాయించి సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ప్రజావేదిక కూల్చడం మొదలుకొని నేటి వరకు ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతి ఒక్కరి గొంతును నొక్కేయడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రోడ్డుపై ఆందోళన చేస్తున్న నాయకులను సిఐ అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ కార్యక్రమంలో కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్,మాజీ సర్పంచ్ మురళీ, నాయకులు గంగవరం, నారాయణ,కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.చిన్నబ్బ, గవిమఠం లోకేష్, కె.నాగరాజగౌడు, బాలాజీ, సూరి, హరి, దేవేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, యుగంధర్, రెడ్డెప్ప, వెంకటేష్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, ఆనంద్, వసరాయ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వానికి కాలం చెల్లింది : గాలి భానుప్రకాశ్



నిరసన వ్యక్తం చేస్తున్న భానుప్రకాశ్

పుత్తూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసిన వైసిపి ప్రభుత్వానికి కాలం చెల్లిందని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో శనివారం పోలీసులు తిరుపతిలో ఉదయం 5.30 గంటలకే ఆయన ఇంటికి వెళ్లి గృహ నిర్బంధం చేశారు. ఆయనతో పాటు టిఎన్‌టియుసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, బిసి సంఘం అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, పుత్తూరు పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, డి.రవికుమార్ తదితర నేతలను గృహ నిర్బంధంలో వుంచారు. నల్ల వస్త్రాలు, కండువాలు ధరించి భానుప్రకాశ్, తదితర నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియంత చేష్టలతో జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని సర్వతోముఖంగా నాశనం చేశారని ఆరోపించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అవినీతి మచ్చ లేని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా సరిదిద్దుకోలేని తప్పు చేశారని తెలిపారు. 2021లో నమోదైన ఈ కేసుకు సంబంధించి సిఐడి విభాగం ఇద్దరిని అరెస్టు చేయగా వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరు లేకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చట్టంలో వున్న నిబంధనలన్నింటినీ అతిక్రమించి పోలీసు అధికారులు అరెస్టు చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగితే చట్టానికి వ్యతిరేకంగా పనిచేసిన పోలీసు అధికారులను ఆ చట్టమే శిక్షిస్తుందని తెలిపారు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా అక్రమ అరెస్టుతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అర్థమవుతోందన్నారు. తమను ఎంత ఇబ్బంది పెట్టినా ప్రజా సమస్యల పరిష్కారానికి తాము చేసే పోరాటాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో... ఇంటి పట్టాలు పంపిణి : కలెక్టర్

తిరుపతిరూరల్, సెప్టెంబర్9 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం వెంకటపతినగర్ గ్రామ పంచాయతీలో పండగ వాతావరణంలో ఇండ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. 36 ఏళ్లుగా ఆవిష్కృతమై ఉన్న భూ సమస్యకు ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిల చొరవతో పరిష్కారం లభించింది. శనివారం వెంకటపతినగర్ వాసులకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి.బాలాజీ, తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదగా 760 మంది లబ్ధిదారులకు ఇంటిపట్టాలు పంఫిణి చేసారు. నిషేధిత జాబితాలో (22ఎ) కింద ఉన్న భూమిని రద్దు చేసి, క్రయ విక్రయాలు జరిగేలా పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అవగాహన లోపంతో సమస్య పరిష్కారంలో జాప్యం జరిగిందన్నారు. నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూర్చేదిశగా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల (22ఎ)కు పరిష్కారం చూపిందని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో వెంకటపతినగర్ వాసులకు భూసమస్య నుండి విముక్తి లభించిందన్నారు. నిషేధిత జాబితా నుండి తొలగించి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రొసీడింగ్స్ అందించినట్లు తెలిపారు. ఈ గ్రామ సమస్య పరిష్కారం కోసం జె.సి. బాలాజీ ఎంతో కృషి చేసారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ వెంకటపతినగర్‌కి సంబంధించిన భూ సమస్యను కలెక్టర్ ఫాజిటీవ్‌గా తీసుకుని పరిష్కరించారని తెలిపారు. 36 సంవత్సరాలుగా పరిష్కారం కానీ సమస్యకు రీ సర్వే చేసి, అన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిస్కరించి, నిషేధిత జాబితా నుండి శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. వెంకటపతినగర్ భూ సమస్య పరిష్కారం కోసం సర్పంచ్ చిన్ని యాదవ్ కృషి వెల కట్టలేనిదన్నారు. తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటపతి నగర్‌లోని గ్రామ ప్రజలకు 36 ఏళ్లుగా తీరని సమస్యకు పరిష్కారం చూపిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిదే అన్నారు. రెవెన్యూ రికార్డులలో ఈ గ్రామానికి చెందిన భూమి ప్రభుత్వ భూమిగా ఉండటం వల్ల నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు.

# చంద్రబాబుకు ఇది ఆరంభం మాత్రమే

## - తప్పుచేశారు కాబట్టే అరెస్ట్.. అచ్చెన్న అరెస్ట్ కూడా తథ్యం
## - చట్టం తనపని తాను చేసుకుపోతుంది:ఎం.పి. రెడ్డెప్ప



మీడియాసమావేశంలో మాట్లాడుతున్న ఎం.పి. రెడ్డెప్ప

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్ ఆరంభం మాత్రమేనని ఆయనపై 24 కేసులు ఉన్నాయని అన్ని కేసులు కూడా బయటకు వస్తాయని చిత్తూరు ఎం.పి. నల్లకొండగారి రెడ్డెప్ప పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్సీ భరత్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే సిఐడి అరెస్ట్ చేసిందని ఈ కేసులో అచ్చెన్నాయుడు అరెస్ట్ కూడా తథ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యల్ని తాము సమర్థిస్తామని చట్టం తనపని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో 371 కోట్లు ఓ కంపెనీకి కేబినెట్ అప్రూవల్‌తో కేటాయించారన్నారు. ఆ సంస్థతో పాటు బోగస్ సంస్థలు ఎన్నో ఉన్నాయనే విషయం వెలుగుచూసిందన్నారు. తాను తప్పు చేయకుంటే తనకు ఈ కేసుకు సంబంధం లేదని చంద్రబాబు చెప్పవచ్చు కదా అని ప్రశ్నించారు. సిఐడి కేసును కరెక్ట్‌గా చేసిందన్నారు. ఇటీవలే చంద్రబాబుకు 119 కోట్ల స్కాంపై ఇ.డి. నోటీసులు ఇచ్చిందని పేర్కొన్నారు. తనను అరెస్ట్ చేస్తారని చంద్రబాబే తొలుత పేర్కొన్నారని వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుతో కుప్పానికి చెడ్డపేరు వచ్చిందన్నారు. ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ గతంలో తమను చంద్రబాబు జైలుకు పంపారన్నారు. చట్టాన్ని చేతుల్లో పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్ చాలా ఆలస్యమైందని కుప్పంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్‌ను సైతం విచారించాలన్నారు. కుప్పంలో మాజీ జడ్పీటిసిలు, ఎంపిపిలు, నేతలు ఎంత దోచారో ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## సాక్ష్యాలతోనే సీఐడీ వారు చంద్రబాబునాయుడు అరెస్ట్

### - వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అన్ని ఆధారాలతోనే అరెస్ట్ చేశారని వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్లి భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు బోగస్ సెల్ కంపెనీతో 375 కోట్ల రూపాయల స్కామ్ చేశారన్నారు. స్కిల్ డెవలప్‌వమెంట్ స్కామ్ చంద్రబాబు నాయుడు ప్రమేయంతోనే జరిగిందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అన్ని అర్హతలు ఉన్నా మా ఇంజనీరింగ్ కాలేజికి ఇవ్వలేదని, వేరే వారికి ఇచ్చారని విమర్శించారు. దీనిని బట్టి ఆయన ఏ మేరకు స్కామ్ చేశారో అర్థమవుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన స్కాముల గురించి అందరికీ తెలుసన్నారు.

## చంద్రబాబు అరెస్టుతో తమిళనాడు సరిహద్దుల్లో ఆందోళన



తడ, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును సిబిఐ అధికారులు అరెస్టు చేయడంతో శనివారం ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే పోలీసులు సకాలంలో స్పందించి ఆందోళన చేస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. పలువురు నాయకులను గృహ నిర్బంధం చేశారు. జాతీయ రహదారిపై బాబు అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేస్తున్న వారిని చెదరగొట్టి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సాయంత్రం దాకా టిడిపి కార్యకర్తలను వదిలిపెట్టలేదు. ఇదిలావుంటే తమిళనాడు నుంచి వచ్చే బస్సులు కూడా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులను ముందుగానే నిలిపివేశారు. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు పరిశ్రమలకు వెళ్లే కార్మికులు కూడా బస్సులు లేక అవస్థలు పడ్డారు.

## తేదేపా నేతల హౌస్‌అరెస్ట్..స్టేషన్‌లో నిర్బంధం

సత్యవేడు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్ష్యుడు నారాచంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు వ్యతిరేఖంగా తెలుగుదేశం పార్టీ నేతలు రోడ్లమీదకి రాకుండా ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సత్యవేడు టీడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్, నాయకులు శివ, నరేంద్ర, పరంధామలను సురుటుపల్లి సమీపంలోని ఆమె నివాసంలో గృహనిర్బంధం చేశారు. అయితే తమిళనాడు వైపుగా సత్యవేడుకు వస్తున్న శ్రీకాళహస్తి టీడిపి ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డిని ఊత్తుకోట సమీపంలోని ఆంధ్రా సరిహద్దులో సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో నిర్బంధించారు. అంతేకాకుండా సత్యవేడు మండల అధ్యక్ష్యుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు భాషా,పార్టీ శ్రేణులు ధర్నా చేసేందుకు రోడ్డు మీదకు వస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా హెలెన్ మాట్లాడుతూ అక్రమంగా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడమే కాకుండా పార్టీ నేతలను కూడా అక్రమ అరెస్ట్‌లు చేయడం రాజ్యాంగ విరుద్ధామన్నారు.

## ఆలయ కుంబాభిషేకంకు మంత్రి పెద్దిరెడ్డి ఐదులక్షల విరాళం

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ కుంబాభిషేకం కోసం రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఐదులక్షలు విరాళం అందించారు. ఈనగదును శనివారం చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు గుడుపల్లె ఎంపిపి వరలక్ష్మి,జడ్పీటిసి కృష్ణమూర్తి, సర్పంచ్ అమర్‌నాథ్‌లకు అందించారు. ఈనెల 11-13 తేదీల్లో జరిగే ఆలయ కుంబాభిషేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 13న మంత్రి పెద్దిరెడ్డి విచ్చేస్తారని తెలిపారు. అంతకుముందే ఆలయ అభివృద్ధికి దేవదాయశాఖ ద్వారా 1.30కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి పాల్గొన్నారు.

## చ్రంద్రబాబునాయుడు అరెస్ట్ అప్రజాస్వామికం

### -తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్09 ప్రభాతవార్త: ప్రాధమిక ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని తిరుపతి టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి అన్నారు. స్కిల్ దెవల ప్మెంట్ ప్రాజెక్టులో చంద్రబాబునాయుడు ప్రమేయం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 14సంవత్సరాలు పాటు సుపరిపాలన చేసిన చంద్రబాబు నాయుడును కక్షపూరితం అరెస్ట్ చేయడం రాజకీయ రాక్షసక్రీడలో భాగమన్నారు. చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై అందోళన చేస్తారని, ముందుగనే టిడిపి నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. టిడిపి నేతలు చెర్లోపల్లి కూడలి వద్ద బైఠాయించి చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ అందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, కత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం అభిమాని గుండెపోటుతో మృతి!



తొట్టంబేడు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును అరెస్టు చేయడంతో తీవ్రమనస్థాపానికి గురైన తెలుగుదేశంపార్టీ అభిమాని గుండెపోటుకు గురై మృతిచెందిన సంఘటన మండలంలోని తంగేళ్ళపాళెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తంగేళ్ళపాళెం దళితవాడకు చెందిన మాజీ ఎంపిటిసి భర్త మోడం.వెంకటరమణ గుండెపోటుకు గురైనాడు. దీంతోగుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన శ్రీకాళహస్తిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ నుంచి తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలపడంతో గ్రామంలోని దళితవాడలో విషాదచాయలు అలముకున్నాయి. మాజీ ఎంపిటిసి భర్త వెంకటరమణ తెలుగుదేశం అభిమాన నాయకుడు. చంద్రబాబు అంటే ఎనలేని అభిమానం. పొలం పనులకు వెళ్ళిన వెంకటరమణ చంద్రబాబు అరెస్టును వార్తలో చూసి గుండెపోటుకు గురైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో పలువురు పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన నూతన జిల్లా డిఆర్‌ఓ పెంచల్ కిషోర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : జిల్లాకు నూతన డిఆర్‌ఓగా నియమితులైన పెంచల్ కిషోర్ జిల్లా కలెక్టర్ వెంకట రమణా రెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం తిరుపతి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసారు.

## మహతిలో అలరించిన... సంగీతసాహిత్య నృత్యోత్సవాలు



తిరుపతి,సెప్టెంబర్ 9ప్రభాతవార్త: రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయ వార్షిక 33వ జాతీయ సంగీతసాహిత్య నృత్యోత్సవాలు శనివారం మహతిలో ఆరంభమయ్యాయి. ఉదయం పలువురు కళాకారులు, రాయలసీమరంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్ రాజ, ఎస్వి వెంకటేశు, సుబ్రమణ్యంరెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, కేశవరెడ్డి,చంద్రబాబు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ నృత్యోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహతి ఆడిటోరియంలో చిన్నారుల కళాకారులు తమతమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు.







# శ్రీకాళహస్తీశ్వరాలయంలో అక్టోపస్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ దృశ్యం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ భద్రత దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువ జాము వరకు అక్టోపస్ సారథ్యంలోమాక్ డ్రిల్ నిర్వహించారు. అక్టోపస్ దళాలు స్థానిక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శ్రీకాళహస్తి టౌన్ సిఐ అంజూయాదవ్ పర్యవేక్షణలో ఆలయ భద్రతకు సంబంధించి రెండు రోజుల పాటు అక్టోపస్ దళాలతో సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్రంలో ప్రధాన ఆలయాల్లో భద్రతకు సంబంధించి రాబోవు రోజుల్లో ఎలాంటి సంఘటనలు ఎదురైనా ఎదుర్కొనటానికి సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో అక్టోపస్ దళాలకు శిక్షణ ఇవ్వటానికి నిర్ణయించింది.ఈ నేపథ్యంలో ఆలయంలోని సమావేశం హాలులో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,అర్చకులు సిబ్బందితో అక్టోపస్ ప్రతి నిధులు, పోలీసులతో సమీక్షించారు.ఈ సందర్భంగా వారికి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పలు అభ్యర్థనలు అందించారు.

**ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన దళాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయం పట్టణ నడిబొడ్డులో ఉంది. ఆలయానికి తూర్పున కైలాసగిరి పర్వత పంక్తులు భక్తకన్నప్ప కొండ పక్కనే లోబావి ఉంది.అయితే ఏదైనా కారణాలతో తీవ్ర వాదులు దాడులకు పాల్పడితే ఆలయాన్ని, ఆస్తులను,భక్తులను ఎలా కాపాడుకోవాలనే అంశంపై సమీక్షించారు.వివిధ అంశాలకు సంబంధించి అధ్యయనంచేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న సెక్యూరిటి వ్యవస్థ సరిపోదని అభిప్రాయపడ్డారు.వీరికి ఎలాంటి అవగాహన అనుభవం లేదని అధికారులు అభిప్రాయపడ్డారు.అర్హులైన సిబ్బందిని పెంచాలనే అంశంపై చర్చించారు.ఈ సందర్భంగా అక్టోపస్ డ్రిల్‌ను రాత్రంతా జరిపారు. అక్టోపస్ ఎస్పి కె.రామచంద్ర, డిఎస్‌పి ఎం.చినకొండయ్య, శివాజి, యు.నాగేశ్వరరావు, వి.కుమార్ వారి సిబ్బంది పాల్గొన్నారు. వారితో పాటు సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ ఆలయ అధికారులు పాల్గొన్నారు.